సాక్షి
జనగామ
శనివారం । 20 । జనవరి । 2024



జాతరలో కళాకృత సమ్మేళనం

మేడారం మహాజాతరలో ట్రైబల్ ఆర్ట్స్, హ్యాం డ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ సమ్మేళనం ఏర్పాటు చేయను న్నట్లు టెక్స్‌టైల్స్ మంత్రిత్వశాఖ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. - 8లో▸



దొంగల ముఠా అరెస్ట్

జల్సాలకు అలవాటు పడి.. ఖర్చులకు డబ్బులు కావాలనే ఉద్దేశంతో తాళం వేసిఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/19^0$

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి పూట చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

‘ఎస్‌ఎంసీ’ ఎన్నికల నగారా

- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు నేడు ఎన్నికల నోటిఫికేషన్
- 29న ఎలక్షన్లు
- 1–8 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులకు అవకాశం
- జిల్లాలో 535 సర్కారు స్కూళ్లు



కలెక్టరేట్‌లో ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

జనగామ: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికల నగారా మోగింది. నాలుగేళ్ల సుదీర్ఘకాలం తర్వాత ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జిల్లాలోని 535 సర్కారు స్కూళ్లలో కొత్త ఎస్‌ఎంసీలు కొలువు దీరనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి శనివారం(నేడు) నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైయింది. ఈ మేరకు పాఠశాల యాజమాన్య కమిటీల నిర్వహణపై కలెక్టరేట్‌లో శుక్రవారం డీఈఓ రాము అధ్యక్షతన ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, మండల నోడల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. ఈనెల 29న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ గ్రాంట్స్ పొందుతున్న పాఠశాలల్లో మాత్రమే ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కమిటీ మొబలైజేషన్ కోఆర్డినేటర్ నర్సింహారావు, డీసీఈబీ సెక్రెటరీ చంద్రబాను, ఏసీజీఈ రవికుమార్, డీసీఈబీ సహాయ కార్యదర్శి రామరాజు పాల్గొన్నారు.

ఎన్నిక ప్రక్రియ ఇలా..

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో 1–8 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులకు అవకాశం కల్పించారు. స్కూల్ హెచ్‌ఎం పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల సమయంలో 50శాతం మంది విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రతీ తరగతికి సభ్యులను ఎన్నుకునే సమయంలో తల్లి లేదా తండ్రికి మాత్రమే ఓటు వేసే అధికారం ఉంటుంది. చేతులు ఎత్తే పద్ధతితో పాటు నోటితో చెప్పడం, అసాధారణ పరిస్థితులు ఎదురైన సమయంలో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించవచ్చు. తల్లిదండ్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యుల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్, తరగతి నుంచి ఎన్నికైన ముగ్గురు తల్లిదండ్రులు(సభ్యులు), ఐదుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు, ఇద్దరు కోఆప్టెడ్ సభ్యులుగా, హెచ్‌ఎం కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ప్రత్యేక ఆహ్వానితులుగా స్థానిక సంస్థల నుంచి సర్పంచ్, మున్సిపల్ చైర్మన్లకు అవకాశం కల్పిస్తారు. చైర్మన్, వైస్‌చైర్మన్ ఇద్దరిలో ఒకరు మహిళ అయి ఉండాలి. ఎస్‌ఎంసీ సభ్యుల కాలపరిమితి రెండేళ్లు. సభ్యుడిగా కొనసాగుతున్న వారి కుమారుడు, కుమార్తె పాఠశాల నుంచి వెళ్లిపోతే పదవీ కాలం అంతటితో ముగుస్తుంది.

విధులు..

ఎస్‌ఎంసీ కమిటీ ఎన్నికైన తర్వాత రెండు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించాలి. పాఠశాల పనితీరు, నిధులకు సంబంధించిన ఖర్చులను పరిశీలించాలి. పాఠశాల వార్షిక ఆదాయ, ఖర్చుల వివరాలను రూపొందించి క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించాలి. పాఠశాలలో అడ్మిషన్ పొందిన పిల్లలు నిత్యం బడికి వచ్చేలా చూడాలి.

తల్లిదండ్రుల సభ్యత్వం వివరాలు

ఎస్‌ఎంసీల నిర్వహణలో రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఒకటో తరగతి నుంచి 5 వరకు 15 మంది సభ్యులు ఉంటారు. ఇందులో 10 మంది మహిళలు, ఐదుగురు పురుషులు ఉండేలా చూసుకోవాలి. ప్రతీ ముగ్గురిలో సాధారణం–1, ఎస్సీ/ఎస్టీ–1, బీసీ/మైనార్టీ–1, 1 నుంచి 7వ తరగతి వరకు 21 మంది కమిటీ సభ్యుల్లో 14 మంది మహిళలు, ఏడుగురు పురుషులు, 1 నుంచి 8 వరకు 24 మందికి గాను 16 మంది మహిళలు, ఎనిమిది మంది పురుషులు, 6 నుంచి 8 తరగతుల వరకు 9 మందిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఆరుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాలో పాఠశాలల వివరాలు

ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	మోడల్
341	64	103	08

ఇంకా మోడల్, యూఆర్ఎస్, సాంఘిక, గురుకుల తదితర పాఠశాలలు ఉన్నాయి.

ఎన్నికల షెడ్యూల్ :

20న : ఉదయం 10 గంటలకు ఎస్‌ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ. మధ్యాహ్నం 2 గంటలకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నోటీసు బోర్డులపై తల్లిదండ్రుల జాబితా ప్రకటన.

22 నుంచి 23 : తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం.

24 : ఉదయం 11 గంటలకు తల్లిదండ్రుల తుది జాబితా ప్రకటన, ప్రదర్శన

29న : ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నిక నిర్వహించి గెలుపొందిన సభ్యుల జాబితాను ప్రకటిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు సభ్యుల నుంచి చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక పూర్తి చేసి కొత్త కమిటీని ప్రకటిస్తారు. రెండు నుంచి 4 గంటల వరకు నూతన ఎస్‌ఎంసీ సమావేశం.

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

- రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వికాస్‌రాజ్

జనగామ రూరల్: రానున్న ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 18 ఏళ్లు నిండిని వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి.. అధికారులు స్పెషల్ క్యాంపెయిన్ చేపట్టి ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. ఈ నెల 22 నుంచి ఓటరు నమోదు, ఫిబ్రవరి 6న ము గింపు, ఫిబ్రవరి 24–మార్చి 14 వరకు డ్రాఫ్ట్ జాబి తా పూర్తి, మార్చి 29న తుది జాబితా సిద్ధం చేసి ఏప్రిల్ 4న ఫైనల్ జాబితా ప్రకటించాలని చెప్పా రు. అనంతరం కలెక్టర్ శివలింగయ్య అధికారులతో మాట్లాడుతూ.. ఓటరు నమోదుపై ఆర్డీఓలు ప్రత్యే క కార్యక్రమాలు చేపట్టాలని, సూపర్‌వైజర్లు, ఏఈఆర్వోలు, బీఎల్‌వోలు ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. ఆర్డీఓలు మురళీకృష్ణ, రామ్మూర్తి, ఏఓ రవీందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, డీఐఓ రాంప్రసాద్, డీఎం దుర్గారావు, డీపీఓ వినోద్ పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితరులు

రైస్ మిల్లర్లు లక్ష్యాలు పూర్తి చేయాలి

జనగామ రూరల్: రైస్ మిల్లర్లకు కేటాయించిన 2022–23 వానాకాలం ధాన్యం లక్ష్యాలను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌లు సుహాసిని, పింకేష్‌కుమార్‌తో కలిసి మిల్లర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత వానాకాలం సీజన్‌లో 1,11,932 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అయిందని, మిగిలిన 3,600 మెట్రిక్ టన్నులు పూర్తి చేయాలని ఆదేశించారు. డీసీఓ రోజారాణి, డీఎం ప్రసాద్, మిల్లర్లు బెల్దె వెంకన్న, జయహరి, రామ్, శ్రీధర్, శ్రీనివాస్, దేవ పాల్గొన్నారు.

న్యూఇయర్ డైరీ ఆవిష్కరణ

జనగామ : తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ న్యూ ఇయర్ డైరీని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శివలింగయ్య ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బాషెట్టి హరిప్రసాద్, సెక్రెటరీ పి.రవీందర్, కోశాధికారి ఇ.శ్రీనివాస్, మన్సూరీ, అనిల్‌బాబు, అన్వేష్, బలరాం, శేఖర్, క్రాంతి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డైరీని అదనపు కలెక్టర్ పర్మార్ పింకేష్ కుమార్‌కు అందించారు.

స్వచ్ఛత.. మన బాధ్యత

- ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కమాండెంట్లు

జనగామ: ఇంటి నుంచి దేశం వరకు స్వచ్ఛతను కాపాడే బాధ్యత మనందరిపై ఉందని ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టీ.పీ భగేల్, అసిస్టెంట్ కమాండెంట్ స్వప్నిల్ పవార్ అన్నారు. ‘స్వచ్ఛతా హీ సేవా–ఏక్ కదమ్ స్వచ్ఛతా కీ ఔర్’ కార్యక్రమంలో భాగంగా రాపిడ్ యాక్షన్ ఫోర్స్ 99 బెటాలియన్ కమాండెంట్ విజయ్‌కుమార్‌వర్మ ఆదేశాల మేరకు పట్టణ పరిధి బతుకమ్మ కుంటలో శుక్రవారం ‘స్వచ్ఛత’పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2వ వార్డు కౌన్సిలర్ వాంకుడోతు అనిత, వాకర్స్ నారోజు రామేశ్వరాచారి, మున్సిపల్ శానిటేషన్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ మల్లిగారి మధు తదితరులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, నగరాలు, పట్టణాలు, గ్రామాలను స్వచ్ఛతగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలని కోరారు. అనంతరం బతుకమ్మ కుంటలో పేరుకు పోయిన చెత్తను వాకర్స్‌తో కలిసి ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందం తొలగించారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ కమాండెంట్

న్యూస్‌రీల్

సాదు జంతువులపై కరుణ చూపాలి



చిల్పూరు: సాదు జంతువులపై ప్రతి ఒక్కరూ కరుణ, జాలి చూపాలని.. హింసకు గురిచేయవద్దని జిల్లా పశువైద్యాధికారి మనోహర్ అన్నారు. మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జంతు సంరక్షణ.. జంతు హింస నివారణ సంఘం(ఎస్‌పీసీఏ) ఆధ్వర్యంలో హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువులను హింసించినా, అక్రమంగా తరలించినా శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. సమావేశంలో మల్కాపూర్ పశువైద్యాధికారి మూడిక అన్వేష్, సర్పంచ్ కొాగరి రవి, ఉప సర్పంచ్ వంశీ, పంచాయతీ కార్యదర్శి పన్నీరు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో నేడు కరెంటు కోతలు

జనగామ: పట్టణంలోని 30 వార్డుల పరిధిలో శనివారం ఉదయం 8.30 నుంచి 11.00 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయని ఎన్పీడీసీఎల్ ఏఈ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సంస్థకు సహకరించాలని కోరారు.

5ఈ టెక్నాలజీ స్కిల్ సెంటర్ ఏర్పాటు



జనగామ: గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువతీ యువకులు, అన్ని వర్గాల ప్రజల్లో ప్రస్తుతం ఉన్న వర్కింగ్ ప్రొఫెషన్‌ను మరింత ప్రతిభావంతంగా చేయడానికి జిల్లా కేంద్రంలో ‘5ఈ టెక్నాలజీ స్కిల్ సెంటర్’ ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ ఫౌండర్ కాసినెద్ది నర్సింహారాజు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 21న పట్టణ పరిధి చిన్నగేటు ఏరియాలో ఈ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని, కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ శివలింగయ్య తదితరులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



జనగామ రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో బడికె ఇందిర అధ్యక్షతన మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకం గ్రామాల్లో మహిళలందరికీ చేరేలా కృషి చేయాలని చెప్పారు. త్వరగా గ్రామ, మండల మహిళా కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని సూచించారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ నీలం పద్మ, జనరల్ సెక్రెటరీ కళ్యాణి, సుంకరి నిర్మల, పట్టణ అధ్యక్షురాలు అనిత, తార, జయ, ఉష, శ్రీలతా రెడ్డి, మాలతీరెడ్డి, మణెమ్మ, జ్యోత్స్న, ఆండాలు, సక్కుబాయి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

జనగామ: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో గ్రాడ్యుయేట్లు తమ ఓటును నమోదు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర కోఆప్షన్ సభ్యుడు మసిఉర్ రెహమాన్ జాకీర్ తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ వెబ్‌సైట్‌లో ఓటు నమోదు చేసుకునే క్రమంలో పాస్‌పోర్ట్ సైజు ఫొటో, గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్, ఓటరు ఐఈ ఎపిక్ నంబర్ అప్‌లోడ్ చేయాలన్నారు. సంబంధిత తహసీల్దార్ వద్ద అందుబాటులో ఉన్న పత్రాలతో ఆఫ్‌లైన్ దరఖాస్తు సైతం సమర్పించవచ్చని, వచ్చే నెల 6వ తేదీ వరకు చివరి అకాశం ఉన్నట్లు వివరించారు.

ఆర్ట్స్ కళాశాలతో ఎంఓయూ

కేయూ క్యాంపస్: తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ములుగు ఐటీడీఏ ఏటూరునాగారం వారు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలతో పొలిటికల్ సైన్స్ విభాగం, తెలుగు విభాగాలతో పరిశోధన రంగాల్లో అవగాహన ఒప్పందాన్ని(ఎంఓయూ) శుక్రవారం కుదుర్చుకున్నారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, డాక్టర్ తిరుణహరిశేషు, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ శివకళ్యాణి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సందర్శన



ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జనగామ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, ఇందుకు అంకిత భావంతో పని చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన ఆయన.. పాయిజన్ విభాగం, మైనర్ ఆపరేషన్ థియేటర్, ఎమర్జెన్సీ విభాగం, జనరల్ సర్జికల్, ఓపీ, ఎన్‌సీడీ క్లినిక్, మానసిక, ఛాతి వైద్యుల పరీక్షలు, ఫిజియోథెరపి తదితర అన్ని విభాగాలను పరిశీలించారు. పొందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా, ఎంసీహెచ్ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ అనురాధ, డాక్టర్ మధుసూదన్‌రెడ్డితో వైద్య సేవలపై సమీక్షించారు. ఆరేళ్లుగా మూలన పడిన సీటీ స్కాన్ గురించి ఆరా తీసిన ఎమ్మెల్యే.. ఈ సేవల పునరుద్ధరణకు సహకారం అందిస్తానన్నారు. జిల్లా, ఎంసీహెచ్ ఆస్పత్రికి ఆరు కిలోమీటర్ల దూరం ఉండడంతో అత్యవసర సమయంలో వైద్యులు, టెక్నీషియన్లు వెళ్లడానికి ఇబ్బంది అవుతోందని, ప్రత్యేక అంబులెన్స్ లేదా మరో వాహన సదుపాయం కల్పించాలని సూపరింటెండెంట్లు ఎమ్మెల్యేను కోరారు. జిల్లా ఆస్పత్రి పైఅంతస్తులో అదనపు గదులు నిర్మిస్తే సేవలు సులభతరమవుతాయని, ఎమర్జెన్సీ విషయంలో వీలైనంత మేరకు రెఫరల్ చేయకుండా, ఇక్కడే వైద్య పరీక్షలు అందించేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. ఎంసీహెచ్‌లో అత్యవసర రక్త పరీక్షలు అందుబాటులో ఉంచాలని, వైద్యులు సమయపాలన పాటించి ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా చూడాలని చెప్పారు. ఆస్పత్రి పరిశీలన అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. సీటీ స్కాన్ యంత్రం త్వరగా వచ్చేలా చూస్తామని, ఆస్పత్రి నుంచి కూడా లెటర్ ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 24 గంటల పాటు అన్ని రకాల సేవలు అందేలా సూపరింటెండెంట్లు పర్యవేక్షించాలని సూచించారు. ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రికి అనుసంధానంగా రవాణా గురించి ఆలోచిస్తామని, అత్యవసర సమయంలో మెడికల్ కళాశాల టీంను వినియోగించుకుంటే జిల్లా కేంద్రంలోనే అద్భుత ఫలితాలు సాధించవచ్చని అన్నారు. అనంతరం టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఖాజా ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ జమునలింగయ్య, కౌన్సిలర్లు గాడిపెల్లి ప్రేమలతా రెడ్డి, ముస్త్యాల దయాకర్, జేపీసీ చైర్మన్ మంగళ్లపల్లి రాజు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్ రెడ్డి, నాయకులు బండ యాదగిరిరెడ్డి, చెంచారపు పల్లవి, నీల యాదగిరి, రావెల రవి, ఉల్లెంగుల సందీప్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఆర్.రాజుకుమార్, ఉడుగుల నర్సింహులు, గంగాభవాని ఉన్నారు.

కుటుంబ నియంత్రణ కష్టాలు

- సరిపడా పడకలు లేక ఇబ్బందులు



ఒక్కో పడకపై సేదదీరుతున్న ఇద్దరు మహిళలు..

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం డీపీఎల్ క్యాంపు(మహిళలకు కుటుంబ నియంత్రణ శిబిరం) నిర్వహించారు. మొత్తం 24 మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశారు. సరిపడా పడకలు లేక ఆపరేషన్ చేసుకున్న మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఒక్కో పడకపై ఇద్దరిని పడుకోబెట్టారు. తాగునీటి సౌకర్యం కూడా సక్రమంగా లేదు. డాక్టర్ గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీదేవి పరిశీలించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవడానికి వచ్చేవారికి సరైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి నెలా రెండవ, నాల్గవ శుక్రవారాల్లో ఈ శిబిరాలను నిర్వహిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య, డాక్టర్ జనార్దన్, డాక్టర్ ప్రసన్నకృష్ణ, డాక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి సాగునీరు అందించాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి




ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హైదరాబాద్ జలసౌధలోని నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు కింద పలు రిజర్వాయర్ల నిర్మాణం జరిగిందని, వాటి పరిధిలో పలు చోట్ల కాల్వల పనులు పూర్తి కాలేదన్నారు. పూర్తయిన చోట పూడిక పేరుకుపోవడం, తూముల షట్టర్లు సరిగ్గా పనిచేయక చివరిభూములకు సాగునీరు అందడంలేదని చెప్పారు. ఈ సమస్యలపై అధికారులు దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పర్యటించి పొలాలకు సాగునీరు అందించేలా పనులు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఇంజనీరింగ్ చీఫ్(ఓ అండ్ ఎం) నాగేందర్, చీఫ్ ఇంజనీర్ రమేష్, సూపరింటెండెంట్ ఇంజనీర్ సుధీర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పదవుల పందేరం!

- నామినేటెడ్ పోస్టుల కోసం ఆశావహుల ఆరాటం
- కీలక పదవి రేసులో వేం నరేందర్‌రెడ్డి? కేబినెట్ హోదా వస్తుందని ప్రచారం
- రాష్ట్రస్థాయి చైర్మన్ పదవుల్లో గతంలో ఉమ్మడి జిల్లానుంచి 9 మంది
- ‘కుడా’ చైర్మన్‌తో పాటు మార్కెట్ కమిటీలకు ప్రయత్నాలు
- రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులపైనా బడా నేతల నజర్
- గాడ్‌ఫాదర్‌లతో కాంగ్రెస్ నాయకుల ప్రయత్నాలు



సాక్షి ప్రతినిధి, వరంగల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల్లో నామినేటెడ్ పదవుల రేసు మొదలైంది. ఎమ్మెల్సీలతోపాటు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల కోసం పదవుల పందేరం జోరందుకుంది. ఉమ్మడి వరంగల్ నుంచి పలువురు సీనియర్ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారు రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. కాంగ్రెస్ సీనియర్ నేత, సీఎం రేవంత్‌రెడ్డి సన్నిహితుడు వేం నరేందర్‌రెడ్డికి కేబినెట్ హోదాతో ప్రభుత్వ ప్రధాన సలహాదారు పదవి రాబోతోందనే ప్రచారం ఉంది. దీంతో నామినేటెడ్ పోస్టుల పరంపర మొదలైందని భావిస్తున్న పలువురు కాంగ్రెస్ నాయకులు తమ స్థాయిలను బట్టి పదవుల దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రేసులో సీనియర్ నేతలు..

నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ మొదలు కావడంతో సీనియర్‌లు ఎవరికీ తోచిన విధంగా వారు ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య వరంగల్ ఎంపీ టికెట్ లేదా ఏదైనా రాష్ట్ర స్థాయి పదవిని ఆశిస్తున్నారు. వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నమిండ్ల శ్రీనివాస్, డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఎండీ.అజీజ్‌ఖాన్, అబుబక్కర్, ఈవీ శ్రీనివాసరావులు ప్రయత్నాల్లో ముందువరుసలో ఉన్నారు. మహిళా నాయకులు సరళాయాదవ్, కూచన రవళిరెడ్డి, పీసీసీ నేత దొమ్మాటి సాంబయ్య, పరకాల టికెట్ వదులుకున్న ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి రాష్ట్రస్థాయి పదవులపై గురిపెట్టారు. జనగామ జిల్లానుంచి వై.సుధాకర్, వేమల్ల సత్యనారాయణరెడ్డి, సి.శ్రీనివాసరెడ్డి, మైనారిటీ వర్గానికి చెందిన జమాల్ షరీఫ్, లక్ష్మి నారాయణ నాయక్, ముత్తినేని సోమేశ్వరరావు, ఎస్.ప్రవీణ్‌రావు ఆశిస్తున్నారు. మహబూబాబాద్ నుంచి మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్ ఎంపీ టికెట్ కోసం పట్టుబడుతున్నారు. లేదంటే ఎమ్మెల్సీ, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ కావాలంటున్నట్లు ప్రచారం. కాంగ్రెస్ ఆదివాసీ కమిటీ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి, నూనావత్ రాధ, మాలోతు నెహ్రూనాయక్, వీరభద్రం తదితరులు పదవుల రేసులో పార్టీ సీనియర్లను కలిశారు. ములుగు డీసీసీ అధ్యక్షుడు పి.అశోక్, గొల్లపల్లి రాజేందర్, భూపాలపల్లి డీసీసీ అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, మాజీ మావోయిస్టు గాజర్ల అశోక్ రేసులో ఉన్నట్లు అధిష్టానానికి తెలియజేశారు. ఇదిలా ఉంటే గ్రేటర్ వరంగల్‌కు సంబంధించి పార్టీ కీలకంగా భావించే ‘కుడా’ చైర్మన్ పదవితో పాటు మార్కెట్ కమిటీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు తదితర పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలను కలవడంతోపాటు గాడ్‌ఫాదర్‌ల చుట్టూ తిరగడం హాట్‌టాపిక్‌గా మారింది.

గత ప్రభుత్వంలో 9 కార్పొరేషన్ పదవులు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 54 రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులను భర్తీ చేస్తే.. అందులో 9 కార్పొరేషన్ల చైర్మన్ పదవులు ఉమ్మడి వరంగల్ సీనియర్ నేతలను వరించాయి. రాష్ట్ర రుణ విమోచన సంస్థ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, రైతుబంధు సమితి చైర్మన్ తాటికొండ రాజయ్య, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, దివ్యాంగుల అభివృద్ధి సంస్థ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి, రెనోవెబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్(రెడ్–కో) చైర్మన్ వై.సతీష్ రెడ్డి, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్, రహదారుల అభివృద్ధి సంస్థకు మెట్టు శ్రీనివాస్, సంగీత, నాటక అకాడమీ చైర్మన్ దీపికా రెడ్డి, జల వనరుల అభివృద్ధి చైర్మన్‌గా వీరమల్ల ప్రకాశ్ వ్యవహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో రద్దయిన ఈ పదవులపై ఆ పార్టీ ఆశావహులు ఎప్పటినుంచే కన్నేశారు. ప్రభుత్వం కూడా ఎమ్మెల్యే సీట్లు వదులుకున్న వారు, ఎమ్మెల్యేలుగా గెలవడానికి సహకరించిన వారికి ఎలాగైనా నామినేటెడ్ పదవులు కల్పించడం, ప్రాబల్యాన్ని చాటుకోవాలనే తలంపుతో ఉంది. ఈ మేరకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు కసరత్తు చేస్తున్నారన్న సమాచారంతో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఆశావహులు యత్నాలను ముమ్మరం చేశారు.

పన్నుల చెల్లింపు నిబంధనలపై అవగాహన ఉండాలి

- ఐటీ జాయింట్ కమిషనర్ మహేంద్ర



సదస్సులో మాట్లాడుతున్న మహేంద్ర

జనగామ రూరల్: పన్నుల చెల్లింపులో కేంద్ర ప్రభుత్వ నియమనింధనలపై అధికారులు అవగాహన ఉండాలని ఇన్‌కం ట్యాక్స్ రాష్ట్ర జాయింట్ కమిషనర్ టి.మహేంద్ర అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ–టీడీఎస్ చెల్లింపులపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ సుహాసిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేంద్ర మాట్లాడుతూ ఆదాయ పన్నుల చెల్లింపు, త్రైమాసిక, వార్షిక రిటర్న్‌లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా ఆదాయ పన్నుల ఇన్‌చార్జ్ మాధవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. స్టేట్‌మెంట్ సమయానికి ఫైల్ చేయకుంటే రూ.200 పెనాల్టీ పడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీఓ పి.నర్సింహారెడ్డి, ఏటీఓ రాజేంద్రకుమార్, ఐటీ అధికారి గీత, శ్రీనివాస్, విరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలను తిలకిస్తున్న విద్యార్థులు



సాంకేతిక సంరంభం

- నిట్‌లో టెక్నోజియాన్–24 షురూ..
- ఆకట్టుకున్న రోబోటిక్ ప్రదర్శనలు.. విద్యార్థుల్లో జోష్

నిట్ వరంగల్‌లో సాంకేతిక సంబురం మొదలైంది. మూడురోజుల సాంకేతిక మహోత్సవం టెక్నోజియాన్–24 అట్టహాసంగా ప్రారంభం కాగా.. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాలనుంచి తరలివచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలిరోజు శుక్రవారం స్పాట్‌లైట్ ఈవెంట్స్ అలరించాయి. టెక్నాలజీ 4.0 వర్చువల్ క్రికెట్, హ్యాండ్ ప్రింటింగ్, ఆర్బిక్స్ పేపర్ కటింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రోబోల ప్రదర్శన ఆకట్టుకుంది.

- కాజీపేట అర్బన్

వివరాలు 8లో

క్లుప్తంగా

23న పారామెడికల్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

ఎంజీఎం : రాష్ట్ర పారామెడికల్ బోర్డు ఉత్తర్వుల మేరకు కాకతీయ మెడికల్ కళాశాలలో మిగిలి ఉన్న వివిధ డిప్లొమా పారామెడికల్ కోర్సుల సీట్ల భర్తీకి ఈనెల 23న రెండో విడత, మాప్ అప్ రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల అడిటోరియంలో ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కౌన్సిలింగ్‌కు గత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు కూడా అర్హులుగా పేర్కొన్నారు. వివిధ పారామెడికల్ కోర్సుల్లో మొత్తం 94 సీట్ల భర్తీకి ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కావున విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు.

కాల్వకు గండి యత్నం


గండికొట్టడానికి సిద్ధంగా ఉన్న జేసీబీ

హసన్‌పర్తి: మండలంలోని అన్నాసాగరం సమీపంలోని 22/బీ డీబీఎం కాల్వకు మళ్లీ గండి కొట్టడానికి యత్నించారు. జేసీబీతో కాల్వ ధ్వంసం చేయడానికి ప్రయత్నించగా.. రైతులు ఘటన ప్రాంతానికి చేరుకుని అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. గతంలో పూడ్చిన గండిని జేసీబీ సాయంతో బుధవారం మళ్లీ తొలగించేందుకు సిద్ధమయ్యారు. దీంతో అన్నాసాగరానికి చెందిన రైతులు అధికారులపై తిరుగబడ్డారు. శనిగరం, అంబాల, కానిపర్తి రైతులతోపాటు అన్నాసాగరం రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎస్‌ఈ ఆదేశాల మేరకే గండి తెరుస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు చెప్పారు. దీంతో ఎస్‌ఈతో మాట్లాడానికి స్థానిక ప్రజాప్రతినిధులు ప్రయత్నించారు. చివరికి ఏఈ భాస్కర్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

జిల్లా వ్యవసాయాధికారిపై ఏడీఏ దాడి

- ఏడీఏపై కలెక్టర్, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

భూపాలపల్లి రూరల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారి విజయ్ భాస్కర్‌పై అదే శాఖలో పని చేస్తున్న టెక్నికల్ ఏడీఏ శ్రీధర్ చేయి చేసుకున్న అనూహ్య ఘటన మంగళవారం చోటు చేసుకుంది. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏడీఏ శ్రీధర్ ఎలాంటి పర్మిషన్ తీసుకోకుండా, సమాచారం లేకుండా ఈనెల 17, 18తేదీల్లో విధులకు గైర్హాజరయ్యాడు. దీంతో అటెండెన్స్ రిజిస్టర్‌లో శ్రీధర్ గైర్హాజరైనట్లుగా నమోదు చేశానన్నారు. దీంతో కోపోద్రిక్తుడైన ఏడీఏ శ్రీధర్ విచక్షణ కోల్పోయి తన చాంబర్‌లోకి వచ్చి తనపై చేయి చేసుకున్నాడని విజయ్ భాస్కర్ పేర్కొన్నారు. తనపై అకారణంగా దాడి చేసిన ఏడీఏ శ్రీధర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. కలెక్టర్ భవేష్ మిశ్రాతోపాటు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు విజయ్‌భాస్కర్ తెలిపారు. ఇదిలా ఉండగా.. డీఏఓతో మాట్లాడాను తప్పా, చేయి చేసుకోలేదని ఏడీఏ శ్రీధర్ తెలపడం గమనార్హం.

సాంకేతిక సంరంభం



నిట్‌లో టెక్నోజియాన్(ఇంజీనియస్)-24 షురూ

- లాంఛనంగా ప్రారంభించిన ఇన్‌చార్జ్ డైరెక్టర్ సోమశేఖర్
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- మొదటి రోజు ప్రత్యేక ఆకర్షణగా క్రియేటివ్ రోబోటిక్స్ టీం ప్రదర్శనలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జ్ డైరెక్టర్ సోమశేఖర్

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో మూడు రోజుల సాంకేతిక మహోత్సవం టెక్నోజియాన్(ఇంజీనియస్)-24 శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. నిట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ సోమశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక విద్యను పంచుకునేందుకు, నూతన ఆవిష్కరణలకు వేదికగా ఇంజీనియస్‌గా నామకరణం చేసిన టెక్నోజియాన్-24 నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ శ్రీనివాసాచార్య, స్టూడెంట్ యాక్టివిటీస్ టీం అధ్యక్షుడు హరికృష్ణ, ఫ్యాకల్టీ అడ్వయిజర్ హరికృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సోమశేఖర్

తొలిరోజు అలరించిన టెక్నోజియాన్-24

టెక్నోజియాన్-24 ఇంజీనియస్ తొలిరోజు స్పాట్ లైట్ ఈవెంట్స్ అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన నెక్స్ వేవ్ కంపెనీ రూపొందించిన టెక్నాలజీ 4.0 వర్చువల్ క్రికెట్, హ్యాండ్ ప్రింటింగ్, ఆర్ఫిక్స్ పేపర్ కటింగ్స్, ట్రేడింగ్ పిట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వరంగల్ కొత్తవాడకు చెందిన క్రియేటివ్ రోబోటిక్స్ సంస్థ ప్రదర్శించిన రోబోలు ఆకట్టుకున్నాయి. టెక్నోజియాన్‌కు దేశ వ్యాప్త ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 6వేల మంది విద్యార్థులు తరలివచ్చారు. ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తూ క్యాంపస్‌లో ఉత్సాహంగా గడిపారు.

నేటి కార్యక్రమాలు ఇవే.....

టెక్నోజియాన్ రెండో రోజు శనివారం స్పాట్‌లైట్స్ ఈవెంట్స్‌లో భాగంగా ఎస్కేప్ రూమ్, వీఆర్ క్రికెట్, ఆర్సీ బగ్గీ, జభాజ్, ఓవర్‌మానియా, పిక్సెల్ టూ

అయోధ్య రాముడిని చూసొద్దాం



అయోధ్యలోని రాముడిని చూసొద్దాం రండి అంటూ ప్రత్యేకంగా మొబైల్‌లోని బ్లూటూత్ సాయంతో రూపొందించిన రోబోటిక్ వాహనాన్ని వరంగల్‌కు చెందిన శ్రీచరణ్ ప్రదర్శించాడు. దేశంలోని వివిధ ప్రాంతాలను దాటుకుంటూ అయోధ్య చేరుకునే విధంగా బ్లూటూత్ ఎలా తోడ్పడుతుందో వివరించడం ఎంతగానో ఆకట్టుకుంటోంది.

ప్రదర్శించింది: శ్రీచరణ్, వరంగల్

అంధులకు దారి చూపే బ్లైండ్ స్టిక్



అంధులకు బాటసారిగా నడకలో ఎదురయ్యే అవాంతరాలను అధిగమించేందుకు బ్లైండ్ స్టిక్ తోడ్పడుతుంది. దీనిని వరంగల్‌కు చెందిన రాము అనే విద్యార్థి తయారు చేశాడు. అల్ట్రా సానిక్స్ సెన్సార్‌తో రూపొందించిన ప్రత్యేక కర్రను అంధులు చేతపట్టుకుని నడుస్తున్న తరుణంలో ఎవరైనా ఎదురైనా, అవంతరాలు దరిచేరిన తరుణంలో బజర్ మోగుతుంది. దీంతో అప్రమత్తమయ్యే అవకాశం ఉంటుంది.

ప్రదర్శించింది: రాము, వరంగల్.

చెయ్యి ప్రింట్ చెయ్యి...



టెక్నోజియాన్-24లో పాల్గొన్న విద్యార్థులు తమ జ్ఞాపకాలను భద్రపరుచుకునేందుకు స్పాట్‌లైట్ ఈవెంట్‌లో భాగంగా ఇంప్రింటింగ్ హ్యాండ్స్‌లో చెయ్యి ప్రింట్ చెయ్యి అంటూ చేతి అచ్చులను పేపర్‌లో ఆవిష్కరించారు. స్నేహితులు ఒకరికొకరు తమ చెయ్యి గుర్తులను అందజేసుకున్నారు.

ప్రమాదాలను పసిగట్టే డిజాస్టర్ మేనేజ్ రోబో



భూకంపం, ఫైర్, గ్యాస్ లీకేజీ వంటి ప్రమాదాలను పసిగట్టి బజర్ రూపంలో తెలియజేస్తూ మానవ హానిని నివారించడంలో డిజాస్టర్ మేనేజ్ రోబో తోడ్పడుతుంది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెన్సార్‌తో రూపొందించిన రోబో ప్రమాదాలను నివారించడంతో పాటు ఆపదలో ఆదుకుంటుంది.

ప్రదర్శించింది : ఇషాన్ అగస్త్య, వరంగల్

అచ్చం క్రికెట్ ఆడినట్టుగానే..



హైదరాబాద్‌కు చెందిన నెక్స్ వేవ్ కంపెనీ రూపొందించిన టెక్నాలజీ 4.0 వర్చువల్ రియాలిటీతో ప్రత్యేక బ్యాట్‌ను చేతితో పట్టుకుని కళ్లకు ప్రత్యేకంగా సెన్సార్ అద్దాలను ధరిస్తే చాలు అచ్చం క్రికెట్ ఆడినట్లుగా అనుభూతిని పొందవచ్చు. ఐపీఎల్ ఆడే క్రికెటర్స్ ఎక్కువగా వీఆర్ క్రికెట్‌ను ఆడుతూ మెళకువలను నేర్చుకుంటారని కంపెనీ ప్రతినిధి ప్రశాంత్ తెలిపారు.

ప్రదర్శించింది: ప్రశాంత్, నెక్స్ వేవ్ సంస్థ ప్రతినిధి

నేను అలెక్సా రోబోను..



'నేను అలెక్సా రోబోను. నన్ను ప్రశ్నలు అడగండి.. నేను జవాబులు చెబుతా అంటుంది మా అలెక్సా రోబో' అని అంటున్నాడు హర్షవర్ధన్. హ్యూమనైట్ రోబోగా రూపొందించిన రోబో మానవుల మాదిరిగా ఆలోచిస్తుంది. మనం అడిగే ప్రశ్నలకు తక్షణమే జవాబు చెబుతుంది. ఇందుకుగాను రిసీవింగ్ సెన్సార్ మోడ్‌ను ఏర్పాటు చేసినట్లు హర్షవర్ధన్ తెలిపాడు.

ప్రదర్శించింది: హర్షవర్ధన్, వరంగల్

ఎస్‌వీఎస్‌లో స్ప్రింగ్ ఫైర్

- రెండురోజుల పాటు వేడుకలు
- ఈనెల 27న అంతర్జాతీయ సదస్సు
- ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుమల్‌రావు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ తిరుమల్‌రావు

హసన్‌పర్తి : కళాశాలలో స్ప్రింగ్ ఫైర్ వేడుకలకు నిర్వహించనున్నట్లు ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. శుక్రవారం కళాశాలలో ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్ తోపాటు వివిధ మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారని చెప్పారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి చదువున్న విద్యార్థుల కోసం మోడల్ పాలిసెట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరికి ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు ఉండదన్నారు. క్యూఆర్ కోడింగ్ స్కానింగ్ చేసుకుని పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇంటర్ విద్యార్థులకు మోడల్ ఎంసెట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వంద రూపాయాల ఫీజును క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు.

27న అంతర్జాతీయ సదస్సు

ఎస్‌వీఎస్ కళాశాలలో జనవరి 27న అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తిరుమల్‌రావు తెలిపారు. లండన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎస్‌వీఎస్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశ విదేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

- రూ.3లక్షల అపహరణ

కాజీపేట: తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఈ ఘటనలో గుర్తు తెలియని దుండగులు రూ.3లక్షల నగదుతోపాటు కొన్ని విలువైన వస్తువులను అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట పట్టణానికి చెందిన శ్రీనివాస్ రావు (బిల్డర్), బబ్లూ కుమార్ (రైల్వే ఉద్యోగి)లు ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇళ్లలో శుభ కార్యాలకు కుటుంబ సమేతంగా వెళ్లారు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆయా ఇళ్లకు ఉన్న తాళాలను పగుల గొట్టి బీరువాల్లోని నగదును అపహరించుకుపోయారు. శుక్రవారం ఉదయం చుట్టుపక్కలవారు గమనించి బాధితులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సీఐ రాజు, ఎస్సై లవన్ కుమార్ చోరీ తీరును పరిశీలించి, ఆధారాల సేకరణ కోసం ప్రయత్నించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సభ్యులు రెండు ఇళ్లలో ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

దొంగల ముఠా అరెస్టు..

- రూ.5లక్షల చోరీ సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రవీందర్

నర్సంపేట రూరల్ : జల్సాలకు అలవాటు పడి.. ఖర్చులకు డబ్బులు కావాలనే ఉద్దేశంతో తాళాలు వేసిఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. నర్సంపేట పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లోని ఖానాపురం మండలానికి చెందిన మడిపెద్ది వినయ్, నర్సంపేట పట్టణంలో ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తున్న బాదం సాయికుమార్, ఖానాపురానికి చెందిన గొటుకుల నవీన్ ముఠాగా ఏర్పడి కొంతకాలంగా జల్సాలు, మద్యానికి బానిసయ్యారు. ఈక్రమంలో డబ్బులు ఈజీగా సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలను ఎంచుకున్నారు. ఖానాపురం మండల కేంద్రానికి చెందిన కుసుమ దినేష్ కుటుంబం ఈనెల 15వ తేదీన వేములవాడలో మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్లింది. దీంతో ముగ్గురు వెళ్లి దినేష్ ఇంటి వద్ద చలిమంట పెట్టుకొని అర్ధరాత్రి వరకు వేచి చూసి, రోడ్డు మీద ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత దినేష్ నానమ్మ ఇంటికి వెళ్లి ఐరన్ పైపుతో ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న బంగారు, వెండి వస్తువులను దొంగిలించారు. ఈనెల 17వ తేదీన నర్సంపేట పట్టణంలోని టీచర్స్ కాలనీలో రెండు ఇళ్లు తాళాలు వేసి ఉండడాన్ని గమనించారు. ఓ ఇంట్లో రూ.3లక్షలు, మరో ఇంట్లోని వెండి పళ్లెం, వెండి తాంబాలం, రెండు వెండి ఏనుగులు, జత వెండి పట్టీలు, వెండి పూజ సామాగ్రి దొంగిలించారు. మొత్తం సొత్తును వరంగల్‌లో విక్రయించి వచ్చిన డబ్బులు వాటాలు వేసుకోవాలని ఈనెల 19న ఉదయం రెండు ద్విచక్రవాహనాలపై వెళ్తుండగా ఖానాపురం శివారులోని పాకాల వాగు సమీపంలో పోలీసులు పట్టుకొని చోరీ సొత్తును రికవరీ చేశారు. రికవరీ చేసిన సొమ్ములో కుసుమ దినేష్ నానమ్మ ఇంట్లో రూ.1.10లక్షలు, నర్సంపేట పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఓ ఇంట్లో రూ.3లక్షలు, మరో ఇంట్లో రూ.90వేలు మొత్తం రూ.5లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దొంగతనం జరిగిన 24గంటల్లోపే నిందితులను అరెస్టు చేసి, సొమ్మును రికవరీ చేసిన సిబ్బందిని అభినందించి, రివార్డులను అందించారు. ఏసీపీ తిరుమల్, టౌన్, సీఐలు, సుంకరి రవికుమార్, కిషన్, ఎస్సైలు శీలం రవి, రాజు, మాధవ్, సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఆయిల్‌ట్యాంకర్


ప్రమాదానికి గురైన బస్సు


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- 8మందికి తీవ్ర గాయాలు

ఆత్మకూరు: ఆర్టీసీ బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టగా బస్సులో ప్రయాణిస్తున్న 8మందికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని నీరుకుళ్ల క్రాస్ రోడ్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా పస్రా నుంచి హనుమకొండకు ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో వెళ్తుండగా మండలంలోని నీరుకుళ్ల క్రాస్‌రోడ్ సమీపంలో ఎదురుగా ములుగువైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ అతి వేగంగా ఢీకొని రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ బొమ్మగంటి సదానందం, కండక్టర్ ఆర్.సునిత ప్రయాణికులు పస్రా గ్రామానికి చెందిన పూజారి సునిత, పూజారి సరిత, పూజారి రజిత తలలకు గాయాలయ్యాయి. పస్రాకు చెందిన చింతోజు దుర్గా భవానికి కాళ్లు, చేతులకు గాయాలుకాగా.. గోవిందరావుపేట మండలం ముత్తాపూర్ గ్రామానికి చెందిన మందపెల్లి శ్రీనివాస్, ఘన్‌పూర్ మండలం లింగంపల్లికు చెందిన వల్లె బొందమ్మ గాయపడ్డారు. గాయాలైన వారిని 108 సిబ్బంది రమేష్, గణపతి చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కండక్టర్ సునిత ఫిర్యాదు మేరకు ఆత్మకూరు సీఐ రవిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్ : రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. జీఆర్పీ డోర్నకల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా మరిపెడ బంగ్లా శివారు గమ్య తండాకు చెందిన గుగులోత్ గణేష్(24) తండ్రి శ్రీను నెల రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురై గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చి మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని సిగ్నల్ కాలనీ సమీపంలో వరంగల్ వైపునకు వెళ్లే మార్గంలో నవజీవన్ రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని 108 ద్వారా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఐదు నెలల కుమారుడు ఉన్నారు. గణేష్ తల్లి నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్ట్ మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అలరించిన సంగీత, నృత్య కళార్చన


కళార్చనలో పాల్గొన్న సంగీత కళాశాల విద్యార్థులు

హన్మకొండ కల్చరల్ : విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ఆవరణలోని పోతన విజ్ఞానపీఠం ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కళార్చన సంగీత నృత్య విద్యార్థుల సాంస్కృతికోత్సవం అలరించింది. కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్టిఫికేట్, డిప్లమా సంగీత, నృత్య కోర్సు విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. మృదంగవిద్వాంసులు భీమ్‌శంకర్ ఆధ్వర్యంలో మృదంగ విద్యార్థి లయ విన్యాసం అలరించింది. హిందూస్థానీ గాత్రం అధ్యాపకులు అనుముల యోష ఆధ్వర్యంలో విద్యార్థులు రాగ్ యమన్ సర్గమ్ లక్ష్మణ్‌గీత్, ధృత్‌ఖయాల్ తీన్‌తాల్ వినిపించారు. కర్ణాటక గాత్రం విద్వాంసులు సింగారపు భాస్కర్ ఆధ్వర్యంలో కర్ణాటక గాత్ర సర్టిఫికెట్ కోర్సు విద్యార్థులు కల్యాణిరాగం ఆదివర్ణంలో వనజాక్షి, బిలహరి రాగం ఖండచాపుతాళంలో పరిదానము, సావేరి రాగం ఆది తిస్రగతి, శంకరి శంకరు శ్రావ్యంగా ఆలపించారు. మృదంగ విద్వాంసులు భీమ్‌శంకర్ మృదంగసహకారం అందించారు. పేరిణి నృత్యం అధ్యాపకురాలు సీహెచ్ నవ్యజ ఆధ్వర్యంలో విద్యార్థులు మేళ ప్రాప్తి సప్త తాళ విన్యాసం, భవానా కౌత్వం నృత్యప్రదర్శన అలరించింది. కూచిపూడి నృత్యం విద్యార్థులు రామాయణ శబ్దం, పూజ నృత్యం చేశారు. కార్యక్రమంలో గడ్డం శంకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

జాతరలో గిరిజన కళాకృత సమ్మేళనం

- టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డైరెక్టర్ అరుణ్‌కుమార్, కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం మహాజాతరలో ట్రైబల్ ఆర్ట్, హ్యాండ్లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్స్ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్లు టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. కేంద్ర పర్యాటక సాంస్కృతిక అభివృద్ధి శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం డైరెక్టర్ అరుణ్‌కుమార్.. కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మేడారంలోని గిరిజన మ్యూజియం, హరిత హోటల్‌ను సందర్శించారు. మేడారం జాతరలో దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ రకాల ట్రైబల్ ఆర్ట్, హ్యాండ్లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్స్ సమ్మేళనం ఏర్పాటు చేసి ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. జాతర సందర్భంగా 20 మంది ట్రైబల్ కళాకారులు సమ్మేళనాన్ని ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తారని తెలిపారు. కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో థీమ్ పెవిలియం ఏర్పాటు చేయడం జరుగుతుందని, దీనిలో దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన సంప్రదాయ సంస్కృతుల కళాఖండాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. జాతరలో ఏర్పాటు చేయబోయే గిరిజన కళాకృతుల సమ్మేళనానికి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గిరిజన కళాకారుల కోసం అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ అరుణ్‌కుమార్ వనదేవతలను దర్శించుకుని పూజలు చేశారు. ఈఓ రాజేంద్రం, పూజారులు డోలు వాయిద్యాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ సత్యపాల్‌రెడ్డి, ఈఓ రాజేంద్రం, ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, డీపీఓ వెంకయ్య, ఏఎస్ఓ రాజ్‌కుమార్, మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ కురసం రవి పాల్గొన్నారు.

గూర్ఖాకు గుండె జబ్బు

- ఆధార్, రేషన్ కార్డు లేక అందని ప్రభుత్వ సాయం
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు


గుండె జబ్బుతో బాధ పడుతున్న డమ్మర్ రాణా

డోర్నకల్: అతనో గూర్ఖా.. రాత్రి పూట కాలనీల్లో తిరుగుతూ దొంగలబెడద నుంచి ప్రజలను కాపాడుతుండేవాడు.. అతనే నేపాల్ దేశానికి చెందిన డమ్మర్ రాణా. 25ఏళ్ల క్రితం కుటుంబంతో సహా డోర్నకల్‌కు వచ్చి స్థిరపడ్డ ఈ డమ్మర్ రాణాది నేపాల్‌లోని ఆచాం జిల్లా కుంతి గ్రామం. భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులతో డోర్నకల్‌లో నివాసం ఉంటూ గూర్ఖాగా పని చేస్తూ చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే ఈమధ్యకాలంలో తరచూ అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయిచుకోగా.. గుండెలో రెండు వాల్వ్స్ మూసుకుపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. చికిత్సకు రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో పేదకుటుంబానికి చెందిన డమ్మర్ రాణా దిక్కుతోచని స్థితిలో పడ్డాడు.

ఆధారమే లేదు..

దీన గాథ

నేపాల్ దేశానికి చెందిన డమ్మర్‌రాణా సుమారు 25ఏళ్లుగా డోర్నకల్‌లో నివాసం ఉంటున్నాడు. కానీ, తనతోపాటు కుటుంబ సభ్యులకు ఆధార్, రేషన్ కార్డు లేదు. దీంతో ఇక్కడి ప్రభుత్వాల నుంచి ఎలాంటి సాయం అందే అవకాశం లేకుండా పోయింది. కార్డుల కోసం పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోగా.. ప్రస్తుతం గుండె జబ్బుతో ఇబ్బంది రావడంతో ఆ పేద కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

దాతలు సాయం చేయాల్సిన ఫోన్ పే నంబర్: చందా అనూష 79953 92162

నేడు, రేపు స్పెషల్ క్యాంపెయిన్

హన్మకొండ అర్బన్: ఓటు నమోదు, మార్పులు, చేర్పులకు ఈనెల 20, 21 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహించనున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈతేదీల్లో బూత్ లెవల్ అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితా, సంబంధిత ఫారాలతో ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉండనున్నట్లు వివరించారు. జనవరి 01, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారు, ఓటరుగా నమోదు కానివారు, ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర మార్పులు, చేర్పులు, అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.